



ఉమారుద్ర కోటేశ్వరాలయంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్

సర్వం శివం

- నేడు మహాశివరాత్రి
- ఉత్సవాలకు ముస్తాబైన శైవక్షేత్రాలు



విద్యుత్ దీపాలంకరణలో శ్రీముఖలింగేశ్వరాలయం



విద్యుత్ వెలుగులో ఉమారుద్ర కోటేశ్వరాలయం



(శ్రీకాకుళం కల్చరల్)

మహా శివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు శ్రీముఖలింగం, ఉమారుద్రకోటేశ్వరాలయం తదితర ఆలయాలను విద్యుత్ వెలుగులతో అలంకరించారు. ప్రత్యేక క్యూ లైన్లు, భారీకేడ్లు ఏర్పాట్లు చేశారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన జలుమూరు మండలం శ్రీముఖలింగేశ్వరంలో నాలుగు రోజులపాటు, టెక్కలి మండలం రావివలసలోని ఎండలమల్లన్న ఆలయంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. అలాగే శ్రీకాకుళంలోని గుడివీధిలో నాగావళి నదీ తీరాన వెలసిన ఉమారుద్ర కోటేశ్వరాలయంలో కూడా మహారుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలు చేయనున్నారు. ఈ పూజల అనంతరం శనివారం తెల్లవారు జామున 3 గంటలకు వేదమంత్రాలు, మేళ తాళాలతో మహానందీశ్వర వాహనంపై స్వామి తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. భక్తులు పెద్దఎత్తున ఉత్సవాల్లో పాల్గొనున్నారు. ఈ మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని ఉమారుద్రకోటేశ్వర ఆలయ ఈవో మునగవలస సుకన్య తెలిపారు. భక్తులకు అవసరమైన సామియానాలు, మజ్జిగ, మంచినీరు అందుబాటులో ఉంటాయని వివరించారు. రూ.20, రూ.50తోపాటు ఉచిత దర్శనాలకు క్యూలైన్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. గురువారం ఉమారుద్ర కోటేశ్వరా లయంలో ఏర్పాట్లను దేవదాయశాఖ సహాయ కమిషనర్ బలివాడ ప్రసాద్ పట్నాయక్ పరిశీలించారు. ఈవో సుకన్యతో చర్చించి.. భక్తులకు అసౌకర్యం కలగరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆరవెల్లి హరిగోపాల శర్మ, ఆరవెల్లి శ్రీరామ్మూర్తి శర్మ, చంద్రశేఖర్ శర్మ పాల్గొన్నారు. అలాగే మంగువారితోట శివాలయం, జీవేశ్వరాలయం తదితర ఆలయాలను విద్యుత్ వెలుగులతో సుందరంగా అలంకరించారు.



శ్రీముఖలింగేశ్వరాలయంలో ప్రత్యేక దర్శనానికి ఏర్పాట్లు

శ్రీముఖలింగంలో పకడ్బందీగా ఏర్పాట్లు..

జలుమూరు: శ్రీముఖలింగంలో శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉచిత, ప్రత్యేక దర్శనాలకు బారీకేడ్లు, షామియానాలు ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, ఉచిత ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

● శివరాత్రి ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ జీఆర్ రాధిక ఆధ్వర్యంలో టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి నేతృత్వంలో 296 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, పలువురు హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, ఉమెన్ కానిస్టేబుల్స్, హోంగార్డులను బందోబస్తుకు నియమించామన్నారు. 11న చక్రతీర్థ స్నానాల వేడుక కోసం మరో 300మంది ప్రత్యేక బలగాలను నియమించామని తెలిపారు.

● శ్రీముఖలింగంలో పక్కాగా పారిశుధ్యం పనులు చేపట్టేందుకు టెక్కలి, నరసన్నపేట నుంచి కార్మికులను తెప్పించామని ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆలయం ఎదురుగా నాలుగు రోజులు వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు అచ్యుతాపురం వైద్యాధికారి పి.సుజాత వెల్లడించారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్య తెలిపారు. శ్రీముఖలింగానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు వివరించారు.




మంగువారితోట శివాలయంలో విద్యుత్ కాంతులు

భక్తజనావళి నడుమ మహేంద్ర యాత్ర

హరిపురం, మార్చి 7: శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని గురువారం అశేష భక్తజనావళి నడుమ మహేంద్ర గిరులకు కాలినడకన యాత్ర ప్రారంభించారు. మహేంద్ర పర్వతాలపై వెలసిన పంచాక్ష్యారిని శుక్రవారం వేకువజామున దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు పయనమయ్యారు. భక్తుల సౌకర్యార్థం పలాస నుంచి మందస మండలం సాభకోట వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్ తెలిపారు. నడక దారిలో సింగుపురం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని వైద్యాధికారి సంపత్‌కుమార్ చెప్పారు.





మహేంద్రగిరులకు.. సింగుపురం వద్ద భక్తుల నడక యాత్ర

ఆందోళన బాట



బొరివంకలో నీటిసరఫరా విభాగం కార్మికుల నిరసన

వేతనాలివ్వకపోతే.. సమ్మెకు సిద్ధం

- గ్రామీణ నీటిసరఫరా విభాగం కార్మికులకు సక్రమంగా అందని జీతాలు
- ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన

కవిటి, మార్చి 7: గ్రామీణ నీటిసరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతన కష్టాలు వెంటాడుతున్నాయి. 25 నెలలుగా జీతాలు అందక.. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాల కోసం అడిగితే అధికారులు ఆగ్రహావేశాలు వెలిబుచ్చుతున్నారని, మరోవైపు కాంట్రాక్టర్లు.. ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని చెబుతూ తమ పొట్ట కొడుతున్నారని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కవిటి మండలం బొరివంకలో కార్మికులు నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే తాము సమ్మెకు సిద్ధమని స్పష్టం చేశారు.

● జిల్లాలో గ్రామీణ తాగునీటి సరఫరా పథకం కింద వివిధ గ్రామాల్లోని పంపుహౌస్‌ల్లో సుమారు 350 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తారు. వీరికి ప్రతి మూడు.. లేదా ఆరు నెలలకోసారి ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం అధికారుల జీతాలను అందజేసేవారు. కాగా.. ప్రస్తుతం సక్రమంగా జీతాలు అందడం లేదు. ప్రభుత్వం ఈ పథకాల నిర్వహణ బాధ్యతను కాంట్రాక్టులకు అప్పగించింది. దీంతో వారి దయాదాక్షిణ్యాల మీద కార్మికుల జీవితాలు ఆధారపడ్డాయి. జీతాలు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఆరు నెలల నుంచి 25 నెలల వరకు బకాయిలు ఉన్నాయి. ఇచ్ఛాపురం సబ్‌డివిజన్ పరిధిలో సుమారు 80 మందికి రెండేళ్లకుపైగా వేతనాలు అందడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాలను అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ క్రమంలో గురువారం బొరివంకలో తాగునీటి పథకం వద్ద ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. 'జీతాల కోసం గతేడాది నవంబరులో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా కనీస స్పందన లేదు. కాంట్రాక్టర్‌తో పరిష్కరించుకోవాలి తప్ప.. స్పందనకు ఎందుకు వస్తున్నారని కొంత మంది అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నార'ని యూనియన్ అధ్యక్షుడు కె.నీలాచలం, జాయింట్ సెక్రటరీ బి.జోగారావు, జి.శ్రీనివాసరావు, వైకుంఠరావు, బి.అప్పలరాజు తెలిపారు. మళ్లీ గత నెలలో స్పందనలో ఫిర్యాదు చేయగా జిల్లాలో బిల్లులు పెండింగ్ లేవని అధికారులు చెబుతున్నారన్నారు. తమ జీతాల విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు అందజేయకపోతే సమ్మెబాట పడతామని తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద బెంతుఒరియాల నిరసన

బెంతు ఒరియాలకు న్యాయం చేయాలి

- ఎస్టీ జాబితాలో చేర్చకపోతే ఉద్యమిస్తాం
- ఎన్నికల్లో అధికారపార్టీకి బుద్ధి చెబుతామని స్పష్టం
- ఇచ్ఛాపురంలో భారీ నిరసన ర్యాలీ

ఇచ్ఛాపురం, మార్చి 7: 'బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలి. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతాం. రానున్న ఎన్నికల్లో అధికారపార్టీకి ఓట్ల ద్వారా తగిన బుద్ధి చెబుతామ'ని బెంతు ఒరియా కులస్థుల నియోజకవర్గ నాయకులు రజనీదొళై, సుమన్ బిసాయి తదితరులు అన్నారు. గురువారం ఇచ్ఛాపురంలోని ప్రజా ప్రస్థానం విజయవాటిక నుంచి భారీ ర్యాలీతో నిరసన చేపట్టారు. బస్టాండ్‌లో ఎర్రన్న కూడలి వద్ద మహిళలు మోకాళ్లపై కూర్చొని ప్రభుత్వానికి, అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని బైఠాయించి నిరసన తెలిపారు. తమను ఎస్టీ జాబితాల్లో చేర్చాలని కొన్ని నెలలుగా నిరసన చేపడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. బెంతు ఒరియా విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు మాట్లాడుతూ.. 'బెంతులు రెండు నెలలుగా రిలే నిరాహార దీక్షలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. కమిటీ నివేదిక కూడా ఇంతవరకూ చూపించలేదు. బెంతు ఒరియాలపై నిరంకుశ వైఖరి విడనాడాలి' అని డిమాండ్ చేశారు.

● బెంతు ఒరియా కుల సంఘ ప్రతినిధులు రజనీదొళై, సుమన్ బిసాయి మాట్లాడుతూ.. 'ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. పూర్వం ఎస్టీలుగా గుర్తింపు పొందిన మాకు ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా కులధ్రువీకరణ నిలిపివేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. బెంతుఒరియా విద్యార్థు లకు కులధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీచేయకపోవడంతో విద్యా, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నాం. ఫీజు రీయింబర్స్ మెంట్ కూడా వర్తించడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీహరికి వినతిపత్రాన్ని అందజేశారు. ఇదిలా ఉండగా బెంతు ఒరియాల ఆందోళన నేపథ్యంలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అక్కడకు చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, బెంతు కుల పెద్దలు రజనీకుమార్ దొళై, శంకర్‌సాహు, దేవరాజ్ సాహు, సుమన్ బిసాయి, శ్రీకాంత్ పూడియా పాల్గొన్నారు.

ఆదిత్యుడికి రేపు కిరణస్పర్శ

అరసవల్లి, మార్చి 7: అరసవల్లిలో ఆదిత్యుడి మూలవిరాట్‌ను శని, ఆదివారాల్లో సూర్యకిరణాలు తాకనున్నాయి. ఏటా ఉత్తరాయణంలో మార్చి 9, 10 తేదీల్లో ఆదిత్యుడికి సూర్యకిరణాలు స్పృశిస్తాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాదీ కూడా మూలవిరాట్‌ను కిరణాలు తాకే అవకాశం ఉందని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు మాల్‌ప్రాక్టీస్

గుజరాతీపేట, మార్చి 7: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో గురువారం ముగ్గురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌లో పట్టుబడ్డారు. కోటబొమ్మాళిలోని జీజేసీ, విక్టరీ జేసీలో ఒక్కొక్కరు, నరసన్నపేటలోని జీజేసీ పరీక్షా కేంద్రంలో మరొకరు ఇన్విజిలేటర్లకు పట్టుబడ్డారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 19,606 మందికి 18,666 మంది హాజరయ్యారు. 940 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ స్టడీస్‌లో 1210 మందికి గాను 1167 మంది హాజరు కాగా, 43 మంది గైర్హాజరయ్యారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గుజరాతీపేట, మార్చి 7: డిగ్రీ సెమిస్టర్ 5, 6 సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో చదువుతున్న విద్యార్థులు 87.98 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డా.కె.సూర్యచంద్రరావు తెలియజేశారు. బీఏలో 89.33శాతం, బీఎస్సీలో 83.77 శాతం, బీకాం, బీకాం ఒకేషనల్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

ఉగాండా టు భారత్

- ఆఫ్రికా బ్రీడ్ కోతుల అక్రమ రవాణా
- వాహనంలో అసోం మీదుగా చెన్నైకు..
- ఇచ్ఛాపురం వద్ద అటవీశాఖ తనిఖీలు
- పట్టుబడిన ముగ్గురు కోల్‌కతా వాసులు



వాహనంలో తరలిస్తుండగా పట్టుబడిన ఆఫ్రికా కోతులు



పలాస, మార్చి 7: ఉగాండా దేశం నుంచి మౌంటేన్ మంకీస్(ఆఫ్రికాబ్రీడ్ కోతులు)ను అసోం మీదుగా చెన్నైకు అక్రమంగా తరలిస్తుండగా.. ముగ్గురు కోల్‌కతా వాసులు కాశీబుగ్గ అటవీశాఖ అధికారులకు ఇచ్ఛాపురం చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించి కాశీబుగ్గ అటవీశాఖ అధికారి ఎ.మురళీకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉగాండా దేశానికి చెందిన రెండు కోతులను అంతర్జాతీయ స్మగ్లర్ల ముఠా మన దేశానికి తీసుకువచ్చి అసోంలో కోల్‌కతాకు చెందిన బ్రోకర్లకు అప్పగించారు. అక్కడ నుంచి కోతులను ఇన్నోవా వాహనంలో ప్రత్యేక బోనులో చెన్నై తరలిస్తున్నారు. ఇచ్ఛాపురం వద్ద సాధారణ తనిఖీ చేస్తున్న అటవీ సిబ్బందికి కోతులు కనిపించాయి. వాటి కోసం ఆరా తీయగా పొంతనలేని సమాధానం చెప్పడంతో వాహనంలో ఉన్న సారబ్‌మండల్, ధనుజంయ్ సింగ్, ముఖేష్ రామ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఆ ముగ్గురినీ కాశీబుగ్గ రేంజ్ కార్యాలయానికి తరలించి వణ్యప్రాణుల అక్రమ రవాణా చట్టం కింద కేసు నమోదు చేశారు. కోతులను తరలిస్తున్న ఇన్నోవా వాహనాన్ని సీజ్ చేశారు. ఆఫ్రికా కోతులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వాహనంలో ఉన్న ఏసీలో ఉంచి ఆహారం, నీరు అందించారు. వాటిని విశాఖలో జంతు ప్రదర్శన శాలకు తరలించారు. గతంలో కూడా పలాస వద్ద అరుదైన మూగజీవాలు అలుదులను ఒడిశా నుంచి స్మగ్లర్లు తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకొని వాటిని అడవిలో విడిచిపెట్టిన విషయం తెలిసిందే.

భువనేశ్వర్ నుంచి విశాఖ వరకూ వందేభారత్ రైలు

- 12న ప్రారంభం

పలాస, మార్చి 7: భువనేశ్వర్- విశాఖ -భువనేశ్వర్ వందేభారత్ రైలును ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 12న వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్నారు. సోమవారం మినహా ఈ రైలు వారానికి ఆరు రోజులు తిరుగుతుంది. మొత్తం 443 కిలోమీటర్లు ఈ రైలు పరుగెడుతుందని రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రతిరోజు ఉదయం 5.15 గంటలకు భువనేశ్వర్‌లో ఈ రైలు బయలుదేరి ఖుర్దా రోడ్-5.33గంటలు, బరంపూర్-7.05, ఇచ్ఛాపురం-7.18, పలాస-8.18, శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస)-9.03, విజయనగరం-9.48, విశాఖపట్నం-11 గంటలకు చేరుతుంది.

● తిరిగి విశాఖపట్నంలో 3.45, విజయనగరం-4.30, శ్రీకాకుళం రోడ్-5.28, పలాస-6.30, ఇచ్ఛాపురం-7.00, బరంపూర్-7.20, ఖుర్ధారోడ్-8.57, భువనేశ్వర్-9.30 గంటలకు చేరుకుంటుందని అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ప్రతి రైల్వేస్టేషన్ వద్ద ఈ రైలుకు రెండు నిమిషాల పాటు హాల్టింగ్ కల్పించారు.



ఉత్సాహంగా..

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని.. శ్రీకాకుళం మండలం కిష్టప్పపేటలో పార్వతీసహిత కైలాశేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సంప్రదాయ క్రీడలు ఉత్సాహంగా నిర్వహించారు. తీతసంగిడి, ఉలవబస్తా, ఇరుసుగుండు, బంపర్స్ తదితర పోటీల్లో పలువురు సత్తా చాటారు. బంపర్స్ పోటీల్లో సీహెచ్ రాజ్యలక్ష్మీ(పైచిత్రం), హరికారాజు ప్రతిభ చూపారు. విజేతలకు నిర్వాహకులు నగదు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

\- శ్రీకాకుళం స్పోర్ట్స్

సూపర్ సిక్స్‌తో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు

సంతబొమ్మాళి: టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలతో అందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. గురువారం కోటపాడు పంచాయతీలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ అట్టాడ రాంప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షుడు కూశెట్టి భానుప్రకాష్, ఐటీడీపీ అధ్యక్షుడు బెండి అరుణ్ కుమార్, వజ్జ ప్రభాకర్, కూశెట్టి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.





టెక్కలి: పెద్దసాన, సారవకోట బద్రి బీసీ కాలనీలో సూపర్‌సిక్స్ పథకాలపై వివరిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు



సంతబొమ్మాళి: కోటపాడులో అవగాహన కల్పిస్తున్న నేతలు

● టెక్కలి: టీడీపీని ప్రతి ఒక్కరు ఆదరించి అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. గురువారం పెద్దసాన గ్రామంలో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

● జలుమూరు (సారవకోట): టీడీపీ-జనసేన ఉమ్మడిగా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బద్రి బీసీ, ఎస్సీ కాలనీల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వాన సూర్యనారాయణ, టి.ముకుందరావు, పల్లి పాపారావు, బలగ బాస్కరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాశీబుగ్గ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ 12వ వార్డు పల్లివీధిలో సామాజిక భవనాన్ని గురువారం ప్రారంభించారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ బల్ల గిరిబాబు, కౌన్సిలర్ పోతనపల్లి ఉమా హరి, సింహాచలం, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం

టెక్కలి: విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. గురువారం రావివలస పంచాయతీ చిన్ననారాయణపురంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం గురువారంతో ముగిసింది. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం.కిశోర్, పీవో కె.గొల్ల, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాచీన విజ్ఞానశాస్త్రం గొప్పదనం తెలుసుకోవాలి

పలాసరూరల్: ప్రాచీన విజ్ఞానశాస్త్రం గొప్పదనం తెలుసుకోవాలని సైన్స్ ఉపాధ్యాయులు సూచించారు. బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్‌లో విజ్ఞానశాస్త్ర వారోత్సవాల్లో భాగంగా గురువారం వివిధ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, పద్మ, రమేష్, చంద్ర శేఖర్‌లను సన్మానించారు.

సమరశీల సంఘటిత పోరాటమే శరణ్యం



మాట్లాడుతున్న లక్ష్మి

పలాసరూరల్: ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న అన్ని రకాల అణచివేతలకు సమరశీల సంఘ టిత పోరాటంతోనే విముక్తి సాధ్యమని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి అన్నారు. మామిడిపల్లిలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేట్, ఫాసిజాన్ని ఓడించాలని, మహిళలు నిర్ణయాధికార స్వేచ్ఛ కోసం పోరాడాలన్నారు. దీనికై ఈనెల ఒకటి నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల హక్కులను, చట్టాలను కాలరాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, పీవోడబ్ల్యూ కోశాధికారి కుత్తుమ హేమక్క, ప్రజాసంఘాల నాయకులు జి.బాలకృష్ణ, గోపి, అప్పయ్య, మాధవరావు పాల్గొన్నారు.

వైభవంగా నీలమణిదుర్గ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నందిగాం: మండల కేంద్రంలో కొలువైన పాతపట్నం అమ్మతల్లి (నీలమణి దుర్గ) గ్రామదేవత ఆలయ పునః ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురువారంతో ముగిశాయి. గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, సహాయకులు ఎం.రమేష్‌శర్మ, వేదపండితులు బంకుపల్లి సురేష్‌శర్మ తదితర ఋత్వికుల పర్య వేక్షణలో నెమలికొండ శాంతి ఆశ్రమ పీఠాధిపతి సదానంద మహర్షి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పూర్ణా హుతి, పంచగవ్య ప్రాసన తదితర కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా సమన్వయకర్త పేడాడ తిలక్, టీడీపీ జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు తదితరులు దర్శించుకున్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

జలుమూరు: లింగాలవలసలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితుడు పి.వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో కల్యాణం కన్నులపండువగా చేపట్టారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశలో కృషి చేయాలి

పాతపట్నం: విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధన దిశలో కృషి చేయాలని వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం 10వతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిరహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్.వైకుంఠరావు మాట్లాడుతూ పరీక్షలకు సమయం ఆసన్నమైనందున కాలం వృథాచేయకుండా ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● నరసన్నపేట: పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు నగదు పురస్కారం అందించనున్నట్లు ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. గురు వారం సత్యవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అలాగే బోర్డు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో దాలినాయుడు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

● పోలాకి: పదో తరగతి విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించాలని సర్పంచ్ దుంపల ఆనందరావు అన్నారు. గురువారం సుసరాం ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం నిర్మలాదేవి, విద్యా కమిటీ చైర్మన్ రమణ, యూటీఎఫ్ నాయకుడు బమ్మిడి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్



మదనాపురం పోలింగ్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

నందిగాం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. అన్నాపురం, కల్లాడ, మదనా పురం, దిమ్మిడిజోల, తమలాపురం, దీనబంధుపురం, హర్షబాడ, కొత్తగ్రహారం తదితర కేంద్రాలను సందర్శించి సదుపాయాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. తహసీల్దార్ బి.పద్మావతి, జోనల్ అధికారి పి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి కానుక వినియోగంపై సామాజిక తనిఖీ

పాతపట్నం: స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ప్రాంగణంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావేదిక ప్రిసైడింగ్ అధికారి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ సువర్ణ మాట్లాడుతూ.. మండలంలో కార్మిక సంక్షేమ మండలి ద్వారా 2018-19, 2019-20 సంవత్సరాల్లో 12 మంది లబ్ధిదారులకు రూ2.40 లక్షల ప్రసూతి నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే సీతారాంపల్లి గ్రామానికి చెందిన మల్లిపురం లక్ష్మీనారాయణ, మల్లిపురం భీమారావుల కుమార్తెలకు ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున మంజూరైనట్లు రికార్డుల్లో ఉన్నా ఇంతవరకు అందించలేదని ఫిర్యాదు చేశారన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సార్పీ దాస్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామకృష్ణ రాజు, డీఆర్పీ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నాటుకోళ్లు చోరీ

నరసన్నపేట: ఇళ్లలో పెంచుకునే కోళ్లను సైతం దొంగతనం చేస్తున్నారు. గత వారం రోజులుగా జమ్ము, రావాడపేట గ్రామాల్లో రాత్రి సమయంలో ఇళ్ల ముందు గూటిలో ఉంచిన నాటుకోళ్లను తస్కరిస్తున్నారు. బుధవారం రాత్రి జమ్ము గ్రామంలో యాళ్ల తాతారావు, రెడ్డి కృష్ణారావు, వెలమల బొడెన్నలకు చెందిన 30 నాటు కోళ్లను దొంగలించారు. మూడు రోజుల కిందట ఇదే గ్రామంలో రావాడ రామారావు, వెంకటరమణ మరో ముగురి ఇళ్ల బయట ఉన్న కోళ్లను తీసుకువెళ్లిపోయారు. రాత్రి సమయాల్లో దొంగలు ద్విచక్ర వాహనాలపై వచ్చి చోరీలకు పాల్పడుతున్నారు.

మహిళా హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

టెక్కలి: మహిళా హక్కుల పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు, అధికారులు కృషి చేయాలని టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద కోరారు. గురువారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో స్వయంశక్తి సంఘాల సభ్యులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వివాహబంధం అత్యంత పవిత్రమైనదని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భార్యా భర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మధుబాబు, బాలకృష్ణ, ప్రభు చంద్, ఆనందరావు, సాయి రాజ్, ఏసీవో శ్రీరాములు, ఏపీఎం జి.నారాయణరావు పాల్గొన్నారు.

మహిళలు రాణించాలి

నరసన్నపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కృషి విజ్ఞాన కేంద్ర పరిశోధకురాలు బి.సునీత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. మహిళలు విద్యావంతులవడం ద్వారా పురోగతి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.అనిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ లైన్‌మన్‌కు అభినందన

రావిచెంద్రి(ఎల్.ఎన్‌పేట): ఇటీవల ఉత్తమ లైన్‌మన్‌గా ఎంపికైన కరకవలస గ్రామ సచివాలయ విద్యుత్ లైన్‌మన్ (గ్రేడ్-2) బొడ్లేపల్లి సుబ్రహ్మణ్యంను గురువారం రావిచెంద్రి సబ్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది సత్కరించి అభినందించారు. ఈనెల 4న టెక్కలి డివిజన్ కార్యాలయంలో డీఈ శంకరరావు, ఏడీఈ ప్రసాదరావు సత్కరించారు. ఈ నేపథ్యంలో గురువారం సుబ్రహ్మణ్యాన్ని సిబ్బంది అభినందించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లు ఒకరిది.. బిల్లు వేరొకరికి

● అధికారుల తీరుపై బాధితుడి లబోదిబో

పలాసరూరల్: జగనన్న ఇల్లు మంజూరైందన్న ఆనందంతో అప్పూ సప్పూ చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు తర్లాకోట పంచాయతీ దానగొరకు చెందిన సవర ఆనంద్. అయితే ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు రాకపోవడంతో ఆరా తీయగా మరో వ్యక్తి ఖాతాలో జమ అయిందని తెలుసుకుని లబోదిబోమంటున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. సవర ఆనంద్‌కు 2022లో ఇల్లు మంజూరైంది. అప్పులు చేసి స్లాబ్ లెవెల్ వరకు నిర్మించాడు. మొదటి విడత బిల్లులు విడుదల చేయాలని గ్రామ సచివాలయం ఇంజనీరింగ్ ఉద్యోగి వెంకటేశ్వరరావుకు తెలిపాడు. లబ్ధిదారుడి వివరాలను పూర్తిగా సేకరించి స్లాబ్ వేసిన అనంతరం తొలి, మలి విడత బిల్లులు మంజూరు చేస్తానని తెలిపాడు. దీంతో స్లాబ్ వరకు నిర్మించినా ఇంతవరకు బిల్లులు రాలేదు. దీంతో లబ్ధిదారుడు శ్రీకాకుళం హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి బిల్లులపై ఆరా తీశాడు. సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించి మండలంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన ఆనంద్ అనే మరో వ్యక్తి ఖాతాలో బిల్లుల మొత్తం రూ.90 వేలు జమ అయినట్లు గుర్తించారు. దీంతో సదరు బాధితుడు తనకు రావాల్సిన బిల్లులు ఇంకొకరి పేరుమీద ఎలా బదలాయించారంటూ ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ విషయమై తహసీల్దార్‌కు, ఐటీడీఏ పీవోకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా ఆధార్ నమోదులో పొర పాటు జరగడం వల్ల వేరే వ్యక్తి ఖాతాలో నగదు జమ అయినట్లు ఇంజనీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. తనకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నాడు. ఈ విషయమై ఎంపీడీవో మెట్ట వైకుంఠరావును వివరణ కోరగా ఇరు ఖాతాదారుల వివరాలను పరిశీలించామని, అనర్హుడి ఖాతా నుంచి నగదును లబ్ధిదారుని ఖాతాలో జమ చేసేలా అధికారులకు సూచించామన్నారు.

సమస్యలు పరిష్కారం కావడం లేదు

ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎదుట గిరిజనుల ఆవేదన

మెళియాపుట్టి: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని గిరిజన సంఘాల నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో స్టీ కమిషనర్ చైర్మన్ డీవీజీ శంకరరావు గిరిజనుల నుంచి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థు లకు వైద్య సేవలు అందక విద్యార్థులు మృతి చెందడం జరుగుతోందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆశ్రమ వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ అన్నాదిర, రోషితారెడ్డి, తహసీల్దార్ జానకమ్మ, గిరిజన సంఘాల నేతలు వి.కృష్ణారావు, కుమార్, శాంతరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు

పలాస: రాష్ట్రంలో ఆశ్రమ, పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయాలని ఆదివాసీ సంఘాల సమాఖ్య జిల్లా నాయకులు సవర రాంబాబు, సవర జగన్నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మెళియాపుట్టి వచ్చిన ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డీవీజీ శంకరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. జిల్లాలో అన్ని గిరిజన గ్రామాలు ఐదో షెడ్యూల్ గ్రామాలేనని, వీటిని నోటిఫైడ్ గ్రామాలుగా గుర్తించి 1/70 చట్టాన్ని అమలు చేయాల న్నారు. ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, జిల్లాల విభజనతో సీతం పేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం లోకి వెళ్లిపోయిందని, జిల్లాకు కొత్తగా ఐటీడీఏ మంజూరు చేయాలన్నారు. పలాస మండలంలో గిరిజన రెసిడెన్షి యల్ హైస్కూల్ ఏర్పాటు చేయాలని, స్థానికంగా ఉన్న గర్ల్స్ పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, రహదారులు లేని గిరిజన గ్రామాలను గుర్తించి వాటికి నిధులు విడుదల చేయాలని కోరారు.

విజయానికి కృషి చేయాలి

వజ్రపుకొత్తూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనసేన పార్టీ పలాస సమన్వయకర్త వి.దుర్గారావు అన్నారు. గురువారం సాయంత్రం నువ్వలరేవులో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన తేజకుమార్



జలుమూరు (సారవకోట): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును పార్టీ బీసీ కమిటీ రాష్ట్ర ప్రతినిధి దర్మాన తేజకుమార్ విజయవాడలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలను ఆయన చంద్రబాబుకు వివరించారు.

గుండు సూదిపై బంగారు శివలింగం



కాశీబుగ్గ: గాంధీ నగర్ కు చెందిన కొత్తపల్లి రమేష్ మహాశివరాత్రిని పురస్కరించుకుని గుండుసూదిపై శివలింగా కారంతో పాటు ఓంకార శివ నామాన్ని గురువారం తయారు చేశారు. ఈ శివలింగాన్ని పలుచటి బంగారు రేకుపై ఎటువంటి అతు కులు లేకుండా, అరసెంటీమీటర్ ఎత్తు, అర సెంటీ మీట ర్ వెడల్పుతో తయా రు చేశానన్నారు. 0.80 మిల్లీగ్రాముల బంగారాన్ని ఉపయోగించి దీనిని తయారు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

సంతబొమ్మాళి: వల్లేవలస జడ్పీ ఉన్నత పాఠశాల్లో పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నిమిత్తం మనబడి అసోసియేషన్ అందించిన గురువారం పరీక్ష కిట్లను ఎంఈవో జలుమూరు చిన్నవాడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

12న ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సదస్సు

టెక్కలి: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ఈనెల 12న టెక్కలిలో సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధానకార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పాలక, ప్రతిపక్ష పార్టీలు బీజేపీతో జతకట్టి ఉత్తరాంధ్ర ప్రజలకు అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, మురళి తదితరులు పాల్గొన్నారు.





అరసవల్లి: నినాదాలు చేస్తున్న గొండు శంకర్ తదితరులు

సరుబుజ్జిలి: ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న కూన రవికుమార్

మళ్లీ జగన్ వస్తే మానవ అవయవాలు తాకట్టు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

సరుబుజ్జిలి: సైకో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రంలోని సహజ వనరులు, ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టారన్నాని, ఇప్పుడు ప్రజలు ఆదమరిచి మళ్లీ గెలిపిస్తే అవయవాలు తాకట్టు పెట్టే ప్రమాదం ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. పురుషోత్తపురం గ్రామంలో గురువారం టీడీపీ ముండల అధ్యక్షుడు అంబల రాంబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు పైడి మురళీమోహన్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, సూపర్‌సిక్స్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిల్లి సిద్దార్థ, శివ్వాల సూర్యనారాయణ, పల్లి సురేష్, లావేటి పూర్ణారావు, తాడేల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

హంతకుల పాలనకు చరమగీతం పాడాలి

అరసవల్లి: రాష్ట్రాన్ని హంతకులు పరిపాలిస్తున్నారని, వీరి పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద 'జస్టిస్ ఫర్ బాబాయ్ - డోంట్ ఓట్ టు వైసీపీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. స్వంత బాబాయినే చంపి, కేసును తప్పుదోవ పట్టించారని, హంతకులకు రాజ్యాధికారం ప్రమాదకరమన్నారు. స్వంత చెల్లెలే హంతకులు తప్పించుకు తిరుగుతున్నారని చెబుతుంటే, అంతకంటే సాక్ష్యం ఏం కావాలన్నారు. కార్యక్రమంలో పాండ్రంకి శంకర్, ఇప్పిలి తిరుమల, బోర గోవిందరావు, గొండు వెంకటరమణమూర్తి, మూకళ్ల శ్రీను, రుప్ప లక్ష్మి, కొయ్యాన జగదీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైకో సీఎంను సాగనంపండి

జి.సిగడాం: రాష్ట్రాన్ని పాలిస్తున్న సైకో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని ఓటుతో బుద్ధి ఇంటికి చెప్పి సాగనంపాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమిడికి రామ్‌మల్లిక్ నాయుడు పిలుపునిచ్చారు. గురువారం శేతుభీమవరం, గంగన్నదొరపాలెం గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, నాయకులు కుదిరెళ్ల బుజ్జి, సూర్యారావు, దాసు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ హ్యాట్రిక్‌కు కృషి చేయాలి

ఇచ్ఛాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే బెందాళం అశోక్ హ్యాట్రిక్ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికిజాని పలిపునిచ్చారు. గురువారం బెల్లుపడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గత మున్సిపల్ ఎన్నికల తర్వాత అనివార్య కారణాల వల్ల సస్పెన్షన్‌కు గురైన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ సాహును తిరిగి పార్టీలోకి ఆహ్వానించామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీయాదవ్, కౌన్సిలర్ కాళ్ల దిలీప్, తెలుగు యువత అధ్యక్షలు కాళ్ల జయదేవ్, పార్టీ జిల్లా కార్యదర్శి ఆశి లీలారాణి, తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: సూపర్ సిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న రామ్‌మల్లిక్ నాయుడు



ఇచ్ఛాపురం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్ర కీలకం

● కోడ్ నియమాలపై అవగాహన తప్పనిసరి

● వర్క్‌షాప్‌లో ట్రైనర్లు



మాట్లాడుతున్న సీపీవో ప్రసన్నలక్ష్మి

కలెక్టరేట్: ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్ర కీలకమని జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట్రామన్ అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి కోడ్ అమలులోకి వస్తుందని, ఆ సమయంలో ఏం చేయాలి, ఏం చేయకూడదు అనే అంశాలపై పూర్తి స్పష్టత అవసరమన్నారు. అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోను కోడ్‌ను ఉల్లంఘించరాదని, ఏదైనా సందేహాలుంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉన్నవారిని పోలింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌తో పాటు సోషల్ మీడియా సెల్, మీడియా మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టరాదని, సి-విజిల్ యాప్‌ను వివరిస్తూ ఏడీఐవో కిరణ్ తెలిపారు. ప్రచార సమయంలో గొడవలకు అవకాశం ఇవ్వొద్దని సీపీవో ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఎలక్ట్రానిక్ ప్రకటనలకు ముందస్తు అనుమతులు తప్పనిసరని డీపీఆర్‌వో చెన్నకేశవరావు సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ, ట్రైన్ కిరణ్‌కుమార్, పబ్లిసిటీ అధికారి తారక్‌ప్రసాద్, ఎన్నికల సెల్ అధికారులు, టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

అందుబాటులో ఏర్పాటు చేయాలి

అరసవల్లి: పోలింగ్ బూత్‌లు ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయాలని టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ కోరారు. గురువారం శ్రీకాకుళం తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో సీహెచ్ రంగయ్య ఆధ్వర్యంలో వివిధ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. మొపసుబందరులో నివసిస్తున్న వారి ఓట్లు వత్సవలస బూత్‌లో ఉన్నాయని, వారికి వారి గ్రామ పోలింగ్ బూత్‌లో ఓట్లు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణితోపాటు నాయకులు మాధవరావు(వైసీపీ), రావాడ పురుషోత్తం(బీజేపీ), తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదారపు వెంకటేష్

డీలర్‌ను వెంటనే తొలగించాలి

లావేరు: లక్ష్మీపురం గ్రామ రేషన్ డిపో డీలర్‌ను వెంటనే తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామ సచివాలయం వద్ద వారంతా ఆందోళన చేపట్టారు. లక్ష్మీపురం, నేదురుపేట గ్రామాలకు చెందిన రేషన్ కార్డు లబ్ధిదారులకు గత నాలుగు నెలలుగా బయోమెట్రిక్ వేయించుకుని కందిపప్పు ఇవ్వకుండా మార్కెట్లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని ఎండీఎం ఆపరేటర్‌ను నిలదీశారు. ఈ విషయమై ఈ నెల 18న కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా స్థానిక రెవెన్యూ అధికారులు పటించుకోవడం లేదన్నారు. ఈ డీలర్ పై ఎన్నోసార్లు అక్రమాలు రుజువైనా చర్యలు తీసుకోకపోవడంపై వారంతా మండిపడుతున్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

ఆమదాలవలస: ఊసవానిపేట రైల్వేగేట్ సమీపంలో పలాస వైపు వెళ్లే లైన్‌లో గుర్తుతెలియని మహిళ మృతి చెందినట్టు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. మృతురాలి వయస్సు 55నుంచి 60 ఏళ్లు ఉండొచ్చని, ఆకుపచ్చ రంగు చీర, చెవులకు దిద్దులు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోసుస్టేషన్‌లో సంప్రదించాన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

జలుమూరు: శ్రీముఖలింగం జమ్మికేశ్వరాలయం వద్ద గురువారం పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.6,990 స్వాధీనం చేసుకొన్నట్టు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన పక్కా సమాచారంతో సిబ్బందితో దాడిచేసి పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సరుబుజ్జిలిలో క్షుద్రపూజల కలకలం

సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి, నందికొండ సమీపంలో ఉన్న వంశధార కుడి ప్రధాన కాలువ ప్రాంతంలో గురువారం ఉదయం క్షుద్ర పూజలు కలకలం రేపాయి. ప్రశాంత వాతావరణంగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి జరిపిన క్షుద్రపూజలు చేశారు. గురువారం ఉదయం కొంతమంది యువకులు ఆ ప్రాంతంలో వ్యాయామానికి వెళ్లి చూడడంతో ఒక్కసారిగా ఈ ప్రాంత ప్రజలు ఉలిక్కిపడ్డారు. పసుపు కుంకుమ, గాజులు, పువ్వులు, నిమ్మకాయలు, కోడిగుడ్లు, కొత్తబుట్టలు, జాకెట్ ముక్కలతో పాటు అనేక రంగులతో కూడిన అన్నాన్ని, మాంసపు ముద్దలు అక్కడ పెట్టి పూజించినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. ఎక్కడ నుంచో వచ్చినవారే ఈపని చేసి ఉంటారని స్థానికులు చెబుతున్నారు.

10న గురుకుల ప్రవేశ పరీక్ష

ఎచ్చెర్ల: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల దుప్పలవలస, ఎచ్చెర్లలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి పరీక్ష ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్స్ దువ్వాడ దేవేంద్రరావు, బి.లక్ష్మి వేర్వేరుగా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య ఐదో తరగతిలో ప్రవేశానికి, అదే రోజు మాధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాల్‌టిక్కట్‌తోపాటు ఆధార్ కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ను, ప్లాంక్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

'ధర్మాన.. నీ భూ అవినీతిపై చర్చకు సిద్ధమా?'

శ్రీకాకుళం అర్బన్: మంత్రిగా జిల్లాలో చేసిన భూ అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ సవాల్ విసిరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు బీసీ డిక్లరేషన్ ఇవ్వగానే జగన్‌రెడ్డి కోటలో బీటలు వారడంతో అతని అవినీతి అనుచరుడైన మంత్రి ధర్మాన సామాజిక న్యాయం అంటూ మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు జగన్‌రెడ్డితోనే బీసీలకు సామాజిక న్యాయం జరిగిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తాడేపల్లి గూడెంలో జనసేన పార్టీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఇళ్లల్లో పోలీసులు అర్ధరాత్రులు సోదాలు నిర్వహించడం దారుణమన్నారు.

సాగునీరు సరఫరాపై సభ్యుల ధ్వజం

సరుబుజ్జిలి: జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరైన వంశధార నీటిని అందించడంలో అధికారులు వ్యత్యాసం చూపడం ఏంటని సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రత్నం, ఈవోపీఆర్డీ ఆనందరావు నివేదికలను చదివి వినిపించారు. వంశధార ఇంజనీరింగ్ అధికారి జగదీష్.. ఆ శాఖ నివేదికను వినిపిస్తున్న సమయంలో వంశధార ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల చేస్తున్న అధికారులు ప్రధాన కాలువకు నీరు నిలుపుదల చేయడంలో అంతర్యం ఏంటని మండల ప్రత్యేక ఆహ్వానితులు కేవీజీ సత్యనారాయణ, జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, షలంత్రి ఎంపీటీసీ శివ్వాల సూర్యనారాయణ, సర్పంచ్ విశ్వేశ్వరరావు నిలదీశారు. తహసీల్దార్ రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ శివానందమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకం

కలెక్టరేట్: శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సేవలు ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. గురువారం రెడ్‌క్రాస్ పరిపాలనా విభాగం, నైపుణ్యాభివృద్ధి భవనాలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర ప్రతినిధులు పాల్గొని రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 34 రకాల సేవలందిస్తున్నట్టు చైర్మన్ జగన్మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భవనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్

అనుమతులు లేకుండా సోదాలు చట్ట విరుద్ధం

ఇచ్ఛాపురం: మంగళగిరిలో జనసేన పార్టీ సిబ్బంది నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా పోలీసులు సోదాలు చేయడం చట్ట విరుద్ధమని ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయకక్షతోనే వైసీపీ ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతుందన్నారు. తాడేపల్లి గూడెంలో జరిగిన టీడీపీ-జనసేన పార్టీ బహిరంగ సభలో శ్రీనివాస్ అనే జనసేన పార్టీ వలంటీర్‌పై వైసీపీ చెందిన కొంతమంది దాడి చేసి గాయపరచడం దారుణమన్నారు. మరోసారి పోలీసులు ఘటనలకు పాల్పడితే జనసేన-టీడీపీ కలిసి తిప్పకొడతామని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పశువైద్యశాల ప్రారంభం

పొందూరు: మూగజీవాల చికిత్సకు ప్రభుత్వాలు ప్రాముఖ్యత ఇవ్వాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. రాపాక గ్రామంలో రూ.26.50 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పశువైద్యశాలను గురువారం స్పీకర్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం దళ్లిపేట బీటీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కె.వనజ, నీలవేణి, జేడీ కిషోర్‌కుమార్, ఏడీలు బాలకృష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్బీకేలతో రైతులకు ఒరిగిందేమీ లేదు

అరసవల్లి: నిధులు లేని ఆర్బీకేలతో రైతులకు ఒరిగిందేమీ లేదని గార మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్ అన్నారు. గురువారం అరసవల్లిలో గల మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి ప్రభుత్వం చెల్లింపులు సరిగా చేయడం లేదన్నారు. రవాణా ఖర్చులతో పాటు చెల్లింపులు సకాలంలో చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. కేంద్రం రైతులకు ఆధునిక యంత్ర పరికరాలు ఇవ్వడానికి ముందుకు వచ్చినా రాష్ట్ర స్పందించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వెలమల శ్రీనివాస్, బొట్ట కామరాజు, ఎన్ని గోపి, రెడ్డి రమేష్, కర్రి వాసు పాల్గొన్నారు.

జిల్లా జైలు సందర్శన

గుజరాతీపేట: జిల్లా జైలును గురువారం సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. ఖైదీలకు అందుతున్న ఆ హారం, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. జైలర్ ఉదయ్ భాస్కర్, తదితరులు ఉన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి

ప్రాధాన్యతా కార్యక్రమాలను త్వరగా పూర్తిచేయాలి

కలెక్టరేట్: వివిధ వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యతా కార్యక్రమాలను త్వరిత గతిన పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ వివరించారు. కాన్ఫరెన్స్‌లో జేసీ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంప్రదాయ క్రీడలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: కిష్టప్పపేట గ్రామంలో సంప్రదాయ క్రీడలు ఉత్సాహంగా సాగాయి. శివరాత్రి పురస్కరించుకుని పార్వతీ సహిత కైలాశేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త గొండు జగన్నాథరావు, గొండు శంకర్ ఆధ్వర్యంలో గురువారం ఈ క్రీడలు నిర్వహించారు. తీతసంగిడి, ఉలవబస్తా, ఇరుసుగుండు పోటీల్లో సత్తాచాటిని గేదెల సత్యనారాయణ (ఒప్పంగి) ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. పొందూరుకు చెందిన సయ్యద్ రజాక్ (పొందూరు) తీతసంగిడి, ఉలవబస్తా పోటీల్లో ద్వితీయస్థానం, ఇసురుగుండు విభాగంలో ఆవల వసంత, రజాక్ సంయుక్తంగా ద్వితీయస్థానం నలిచారు. బంపర్స్ మహిళా విభాగంలో సీహెచ్ రాజ్యలక్ష్మి, హరికారాజు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. విజేతలకు అరసవల్లి శ్రీనివాసరావు, గుజ్జల హిమగిరి చేతులు మీదుగా నగదు, ప్రోత్సాహక బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు కన్సోలేషన్ నగదు బహుమతులతో సత్కరించారు. అరసవల్లి మోహనరావు, గుండ మురళి, ముద్దాడ సత్యనారాయణ, బాణ్ణ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో పునర్జీవనం

పొందూరు: గుండెపోటుకు గురై ప్రాణాపాయం స్థితి వెళ్లినవారికి సీఆర్‌పీ ద్వారా పునర్జీవనం ఇవ్వవచ్చునని ప్రముఖ గుండె వైద్యనిపుణులు కంచరాన వినోద్‌కుమార్ అన్నారు. తోలాపి గ్రామంలో జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండియా (జేసీఐ) శ్రీకాకుళం ఆధ్వర్యంలో కార్యక్రమంలో సీపీఆర్ ప్రక్రియపై ఆయన అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన పది నిమిషాల్లో సీపీఆర్ చేస్తే తిరిగి ప్రాణం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.సత్యరాజ్, జేసీఐ ప్రతినిధులు సుదర్శన్, జగదీష్, ఉమామహేశ్వరరావు, పాల్గొన్నారు.

రెండు పూటలా పని వద్దు

గార: ఉపాధి పథకం పనులు చేస్తున్న వేతనదారులు రెండు పూటలా పనులు చేయాలన్న నిబంధనలు సడలించి ఒక్కపూట పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షురాలు జి.ఈశ్వరమ్మ అన్నారు. గురువారం ఉదయం రామచంద్రాపురానికి ఉపాధి పథకం పనులు చేస్తున్న వేతనదారులతో వారు మాట్లాడుతూ.. ఉపాధి పథకం చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు వేతనదారులు పాల్గొన్నారు.

ప్రత్యేకహోదా వచ్చే వరకు పోరాటం

ఆమదాలవలస: రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే పీసీసీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక హోదాపై న్యాయ పోరాటం సభల్లో ఆమె పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రత్యేక హోదా విషయాన్ని పక్కకు నెట్టిందన్నారు. డీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అంతా కలిసి ప్రత్యేక హోదాపై పోరాడుతామన్నారు. కాంగ్రెస్ నాయకులు జేడీ శీలం, గిడుగు రుద్రరాజు, పల్లంరాజు, తులసిరెడ్డి, ఇతర కాంగ్రెస్ పెద్దలతో కలిసి న్యాయసాధన ప్రతిజ్ఞ చేశారు.

సాగు పథకంపై అవగాహన

బూర్జ: ఓవీపేట గ్రామంలో వెంకటనాయుడుచెరువు ఆయకట్టు రైతులకు ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీడీ గురుమూర్తి మాట్లాడుతూ ఏపీఐటీపీ పథకం ద్వారా రైతుల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో జలవనరులశాఖ, వ్యవసాయశాఖ, భూగర్భ జలశాఖ, మత్స్యశాఖ, ఉద్యానవనశాఖలు సమన్వయంతో పనిచేస్తాయన్నారు. వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమవ్వాలి

ఇచ్ఛాపురం: టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమవ్వాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్ పల్లంటి చిరంజీవి సూచించారు. గురువారం స్థానిక పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం నిర్ణయాధికారం కలిగి ఉండాలి

● ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అరసవల్లి: మహిళలు స్వయం నిర్ణయాధికారం కలిగి ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సెషన్స్ జూనియర్ సివిల్ న్యాయాధికారిణి డి.భరణి అన్నారు. స్థానిక ఆర్టీసీ శ్రీకాకుళం-1 డిపో గ్యారేజీ ఆవరణలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎంతో పురోగతిని సాధించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో విధుల్లో ఉత్తమ ప్రతిభ కరబరిచిన మహిళలపే నగదు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణవేణి, శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు రమేష్ గంగరాజు, దక్షిణామూర్తి, ఎల్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అరసవల్లి: మాట్లాడుతున్న న్యాయాధికారిణి భరణి

చదువుల్లో రాణించి స్థిరపడాలి

అరసవల్లి: విద్యార్థినులు చదువులో రాణించి, జీవితంలో స్థిరపడాలని నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. శక్తి ఇంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్, ప్రగతి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ వర్సిటీ వీసీ రజని మాట్లాడుతూ.. మహిళలు స్వావలంబన సాధించిన నాడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సత్కరించారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, మోహన్‌రాజు, డాక్టర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పులు

శ్రీకాకుళం అర్బన్: విద్యతోనే సమాజంలో సమూల మార్పులు వస్తాయని ఎస్పీ జీఆర్ రాధిక, నగర పాలక సంస్థ కమిషనర్ తమిమ్ అన్సారియా అన్నారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో జిల్లా స్త్రీ మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. మహిళా ప్రగతితోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ రజని, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎంవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విజయం సాధించాలి

కలెక్టరేట్: మహిళలు అన్నింటా విజయం సాధించాలని నాబార్డు డీడీఎం కె.వరప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ వద్ద గల శాంతా అనురాగ నిలయంలో నాబార్డు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో వైసీటీ డైరెక్టర్ ప్రసాదరావు మాస్టర్, ఆర్ఫ్ సన్యాసిరావు పాల్గొన్నారు.

చదువుతోనే మహిళా సాధికారత

పొందూరు: చదువుతోనే మహిళల్లో చైతన్యం కలిగి సాధికారత సాధ్యమవుతుందని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పొందూరుకు చెందిన వాసవి గ్లోబల్ స్పిరిట్యువల్ కౌన్సిల్ అధ్యక్షులు బండారు ప్రతాప్ ఆధ్వర్యంలో లోలుగు కేజీబీవీ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య, న్యాయవాదులు కె.మంజుల, బ్రహ్మాజీ, రాము పాల్గొన్నారు.

మహిళాభివృద్ధితో ఉన్నత శిఖరాలు

ఆమదాలవలస: మహిళలతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని డ్రిగీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ జ్యోతి ఫెడరిక్ అన్నారు. గురువారం పట్టణంలో సమస్త కో-డైరెక్టర్ ధనలక్ష్మి అధ్యక్షతన అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా నిర్వమించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో న్యూట్రీషన్ స్పెషలిస్ట్ శేషు, సాహిత్య అకాడమీ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు: మాట్లాడుతున్న న్యాయాధికారి జోత్స్న



శ్రీకాకుళం అర్బన్: మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

● **ఇచ్ఛాపురం:** మండల సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ బోర పుష్ప బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం సనపల ప్రసాద్, స్త్రీనిధి మేనేజర్ కె.రాము, సీసీలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: జ్యోతి ఫెడరిక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నేడు వ్యాసరచన పోటీలు

అరసవల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు - సమస్యలు - కర్తవ్యాలు అనే అంశంపై వ్యాసరచన, కవితలు (ధీర వనిత) పోటీలు నిర్వహించనున్నట్టు యూటీఎఫ్, సీఐటీయూ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఈ పోటీల్లో మహిళలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.